క్లుప్తంగా

జాతీయ విజేతలకు అభినందన



అభినందిస్తున్న డీఈవో మాధవి

సుల్తానాబాద్: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో విజేతలుగా నిలవడంతో పెద్దపల్లి డీఈవో మాధవి మంగళవారం అభినందించారు. జిల్లా కేంద్ర కార్యాలయానికి విద్యార్థులు వెళ్లగా వారిని అభినందించారు. ఈనెల 2న హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్, గామా ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్, గణిత, స్పెల్లింగ్ బి పోటీల్లో విద్యార్థులు కె.మాన్విక్, ఎం.రితన్య, ఎం.సంచిత్ ప్రతిభ కనబరిచారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ ఉన్నారు.

సిరిపురంలో డీఎల్‌పీవో పర్యటన



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సతీశ్

మంథని: మండలంలోని సిరిపురంలో మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి సతీశ్ పర్యటించారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. నిరంతరం ఇంటింటా చెత్త సేకరణ చేయాలని, ఇంటి పన్ను వందశాతం పూర్తి చేసి నట్లుగానే ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి పనులపై ఎంపీడీవో భాస్కర్‌రావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 14వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, డీఎస్‌ఆర్ ఎంట్రీ, 2024–25 వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. లైబ్రరీ సెస్ జమ చేయడం, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఫీజు చెల్లించేలా చర్యలు చేపట్టడంతోపాటు షార్ట్‌ఫాల్ దరఖాస్తులను మరోసారి అప్‌లోడ్ చేయడం, వీడబ్ల్యూఎస్‌సీ, ఈజీఎస్, క్యాష్‌బుక్‌ల నిర్వహణ, అన్ని రికార్డులను అప్‌డేట్ చేయాలని సూచించారు. ఉపాధి పనుల నిర్వహణ, నర్సరీ నిర్వహణ, 2024–2025 బడ్జెట్ తయారీ, గ్రామాల్లో ఉన్న దుకాణాలు గుర్తించి రిజిస్టర్‌లో రాసి ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో అరిఫ్, ఏపీవో సదానందం, కార్యదర్శులు, ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

జూలపల్లి: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో, ప్రణాళికాబద్ధంగా చదివి, పరీక్షలు రాయాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగినన్ని నీళ్లు, ద్రవాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాదుల్, కలీముద్దీన్, ఏఎన్‌ఎంలు అరుణ, రుక్మిణి, అనంతరావ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

పాలకుర్తి: మండలంలోని కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించడం, టైం మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ తదితర అంశాలపై గోదావరిఖనికి చెందిన మేజిక్ రాజా, జావిద్‌పాషా, వరలక్ష్మి విద్యార్థులకు శిక్షణనిచ్చారు. అదేవిధంగా తాటిపాముల రమేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్స్, వాటర్ బాటిళ్లు అందజేశారు. దేవీ లక్ష్మినర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు ముంజరాజుగౌడ్, తాటిపాముల రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమలాకర్, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖోలో ప్రత్యేక శిక్షణ

- ఏడాది క్రితం ఖేలో ఇండియా కింద ఎంపికైన సుల్తానాబాద్
- మెలకువలు నేర్పిస్తున్న శిక్షకులు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

సుల్తానాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా క్రీడలను ప్రవేశపెట్టింది. జిల్లాలో సుల్తానాబాద్‌ను ఏడాది క్రితం ఎంపిక చేసి, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను కోచ్‌లుగా నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంతో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధుకర్‌ను కోచ్‌గా నియమించారు. దీంతో ఆయన ఏడాదిగా పలువురు విద్యార్థులకు నిత్యం ఖోఖో ఆటలో మెలకువలతో పాటు రన్నింగ్ ప్రాముఖ్యతను వివరిస్తూ నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నారు. ఖేలో ఇండియా లక్ష్యం ఇండియాలో, ఆసియా కప్‌లో అత్యధిక పథకాలు సాధించడమే కాకుండా ఒలంపిక్స్‌లో ఇండియా ఖోఖోలో బంగారు పథకాలు సాధించి పేరు తీసుకురావడానికి ఈ క్రీడల ప్రధాన లక్ష్యం అని డీవైఎస్‌వో సురేశ్ తెలిపారు.

సుల్తానాబాద్ ఎంపికకు అనేక కారణాలు..

ఖేలో ఇండియా కింద సుల్తానాబాద్ ఎంపికకు అనేక కారణాలు ఉన్నాయి. అనేక ఏళ్ల నుంచి చాలామంది క్రీడాకారులు జిల్లా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తున్నారు. ఉన్నత స్థానాలలో సుల్తానాబాద్‌కు చెందిన క్రీడాకారులు ఉండడమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. స్విమ్మింగ్‌లో ఇంగ్లీష్ ఛానల్ ఈదిన క్రీడాకారుడు రాజ కొమురయ్యది సుల్తానాబాదే.

సుల్తానాబాద్‌లో ఫిజికల్ డైరెక్టర్లు..

సుల్తానాబాద్‌లో అంతటి శంకరయ్య, దాసరి రమేశ్, ఎండీ యూనిస్ పాషా, బిట్ర శ్రీనివాస్, బాలసాని రాజ్‌కుమార్‌గౌడ్, దాసరి ప్రసాద్, ప్రణయ్, ప్రైవేటు ఫిజికల్ డైరెక్టర్లు పులి రమేశ్, బైరగోని రవీందర్‌గౌడ్, గోలి సుధాకర్, గెల్లు మధుకర్ యాదవ్, సిలివేరి మహేందర్, ఆలేటి సంపత్ కుమార్, ఇక్బాల్, అజ్జు, గోలి నరేందర్, శివ, సత్యనారాయణ ఉన్నారు.

భవిష్యత్ తరాలకు ఉపయోగం



కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం భవిష్యత్ తరాలకు క్రీడా విద్యపై అవగాహనతో పాటు ఆసియా, ఒలంపిక్స్ క్రీడల్లో పథకాలు సాధించడం లక్ష్యంగా ఇప్పటి నుంచే విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేసి కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి.

– సురేశ్, డీవైఎస్‌వో, పెద్దపల్లి

మెలకువలు నేర్పిస్తున్న



సీఎం కప్‌తో పాటు పలు రకాల క్రీడల్లో ఖేలో ఇండియా విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. ఖోఖోలో ఆసియా కప్‌తో పాటు ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యంగా క్రీడాకారులకు మెలకువలు నేర్పిస్తున్న.

– గెల్లు మధుకర్‌యాదవ్, ఖేలో ఇండియా కోచ్, సుల్తానాబాద్

లక్ష్యం సాధించే దిశగా..



ఖో ఖో మేలుకోలు నేర్చుకోవడంతోపాటు ఆటలో రాణించడం ఎలా అని పాయింట్ల రూపకంగా వచ్చేలా ఎలా ఆడాలో నేర్పుతున్నారు. మెలకువలతో ఆడితే రాణించడం సునాయాసమే. నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకెళ్తా.

అక్షర, విద్యార్థిని, సుల్తానాబాద్



జ్యోతినగర్: ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహించే కొందరు ఆస్పత్రిలో ఉపయోగించిన సిరంజీలతో పాటు తదితర వ్యర్థాలను ఇష్టానుసారంగా రోడ్లపై పడేస్తున్నారు. ఆస్పత్రిలో ఉపయోగించిన వాటిని బయో వేస్టేజీ వాళ్లకు అందించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో మంగళవారం ఓ ప్రథమ చికిత్స కేంద్రం ముందు సిరంజీలు పడేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ఎన్టీపీసీ బూడిద దోపిడీని కట్టడి చేయాలి



మాట్లాడుతున్న కౌశిక హరి, నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థలో బొగ్గు వినియోగంతో విడుదలయ్యే బూడిదను హోల్‌సేల్‌గా కొందరు వ్యక్తులు దోపిడీ చేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి ఆరోపించారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని శ్రీనివాస హాలులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సూక్ష్మ, చిన్న సంస్థలకు ఫ్లైయాష్ సరఫరా, చెరువు బూడిదను ఎత్తడం, విక్రయించడంలో అక్రమాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. గతంలో కొంతమంది చేసిన బూడిద వ్యాపారం వారసత్వంగా ప్రస్తుతం కొనసాగుతోందని విమర్శించారు. ఎన్టీపీసీ సంస్థ పారదర్శకంగా వ్యవహరించకపోవడంతోనే అక్రమాలు జరుగుతున్నాయన్నారు. బూడిద చెరువు నుండి బూడిదను లోడింగ్ చేసే పేరుతో దళారులు డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారిందని అన్నారు. 114 మంది యాష్ వినియోగదారులకు కాంట్రాక్టు లభించిదని, కానీ గ్రౌండ్ లెవల్‌లో బూడిద వినియోగదారులకు అందడం లేదన్నారు. ఎన్టీపీసీ కేవలం 4 నుంచి 5 యంత్రాలకు మాత్రమే అనుమతి ఇవ్వగా ఒక్కో ట్రక్కుకు రూ.4,500 నుంచి రూ.9,100 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్టీపీసీ బూడిద రవాణా విషయంపై ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంతకు వినతిపత్రం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. బూడిద మాఫియాను వెంటనే కట్టడి చేయాలని లేకుంటే స్థానిక ప్రజలతో పాటు భూనిర్వాసితులతో కలిసి పాదయాత్రగా వెళ్లి సీఎంకు వివరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. సమావేశంలో శ్రీనివాస్, బుర్ర శంకర్‌గౌడ్, సాదుల రాంబాబు, ప్రవీణ్, శంకర్, బత్తిని సతీశ్, స్వామి, మేకల శ్రీనివాస్, రవి, రాధారపు రాజమల్లయ్య పాల్గొన్నారు.

సేవాసమితి ఆధ్వర్యంలో ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రామగిరి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో మంగళవారం సేవాసమితి ఆధ్వర్యంలో సీఎస్‌పీవో క్లబ్‌లో లేడీస్ క్లబ్ సభ్యులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు మాట్లాడారు. ఏటా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు గుర్రం శ్రీహరి, సుధాకర్, నాగరాజు, హరిణి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులపై 25శాతం మినహాయింపు

సుల్తానాబాద్: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) ఫీజులపై ప్రభుత్వం 25శాతం మినహాయింపు కల్పిస్తున్నట్లు కమిషనర్ మమ్మద్ నియాజ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం పరిధిలో మార్చి31లోపు ఫీజు చెల్లించి తమ ఆస్తులను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

సుల్తానాబాద్: పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే అన్ని రంగాల కార్మికుల వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ వాగ్దానం చేసిందని, అధికారంలోకి వచ్చి 15నెలలు పూర్తయినా ఏ ఒక్క రంగంలోని కార్మికుల వేతనాలు పెంచలేదన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి, జీవో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్చి 6న కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైస్‌మిల్ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, నాయకులు సంపత్, మహేందర్, లక్ష్మయ్య, రవీందర్, విలాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: స్థానిక రాంమందిర్ సబ్ స్టేషన్‌లోని 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8ఎంవీఏగా మారుస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గోదావరిఖని ఏడీఈ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

• కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

ధర్మారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మేడారం లింక్‌కాల్వ నిర్మాణం పూర్తికాకపోవడానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, బ్లాక్ 2 అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడారు. మేడారం లింక్‌కాల్వ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు బీఆర్‌ఎస్ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతోనే నిర్మాణ పనులు నిలిపివేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

• మందుబాబులకు సామాజిక సేవా శిక్ష

గోదావరిఖనిటౌన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 15మంది మందుబాబులకు గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి సామాజిక సేవ శిక్షను విధించారు. ఎన్టీపీసీ, గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిపిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 15మంది మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని మంగళవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా సామాజిక సేవలో భాగంగా అడ్డగుంటపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

• ఎన్టీపీసీ బూడిద ఉచితంగా అందించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ బూడిదను ఉచితంగా అందించాలని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఏరియా మల్యాలపల్లె గేట్ సమీపంలో బూడిద తరలించేందుకు ఏర్పాటు చేసిన రోడ్డుపై మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా బూడిద రవాణా చేసే వాహనాల యజమానులకు సంస్థ ఉచితంగా బూడిద అందించడంతో పాటు లోడింగ్ సైతం ఉచితంగా చేయాలని సూచించారు. యాష్ యుటిలైజేషన్ మార్గదర్శకాల ప్రకారం బూడిదను ఉచితంగా అందించాలన్నారు. బొగ్గు ఆధారిత పరిశ్రమల నుంచి వెలువడే బూడిదను నేషనల్ హైవే అథారిటీ సంస్థలకు రవాణా ఖర్చులు చెల్లించి తరలింపు చేస్తున్న విధానంతోనే స్థానికంగా బూడిదను వినియోగిస్తున్న ఆయా పరిశ్రమలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. బూడిద తరలింపు అక్రమాలపై సంబంధిత కేంద్ర మంత్రులకు, ఆయా విభాగాలకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

• విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని కొన్ని ప్రైవేట్ ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం ఆరోపించారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

• కరపత్రాలు ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 9న నిర్వహించే అఖిల భారత పద్మశాలీ మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం సభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని స్థానిక మార్కండేయకాలనీ శివాలయంలో పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు బండారి రాయమల్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నీలయ్య, లక్ష్మీనారాయణ, రాజేశ్, పెగడ, దినేశ్, ఆర్‌ఎస్ మూర్తి పాల్గొన్నారు.

• పద్మశాలీ మహాసభను విజయవంతం చేయండి

కమాన్‌పూర్: హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభను విజయవంతం చేయాలని అడ్‌హక్ కమిటీ చైర్మన్ నీలయ్య కోరారు. మండల కేంద్రంలో మంగళవారం మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బర్ల లక్ష్మీరాజం, కుందారపు బాపు, పెగడ చందు, రామ్మూర్తి, శంకర్, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

• బొగ్గు తరలిస్తున్న ఆటోట్రాలీ పట్టివేత

గోదావరిఖని: స్థానిక చంద్రశేఖర్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద ఆటోట్రాలీలో బొగ్గు దొంగతనం చేస్తుండగా మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డికి అందిన సమాచారం మేరకు ప్రత్యేక సెక్యూరిటీ బృందాలు తరలివెళ్లి పట్టుకున్నాయి. 40బస్తాలను స్వాధీనం చేసుకుని ఆటోను ఆర్జీ–1 జీఎం ఆఫీస్‌కు తరలించారు. పట్టుకున్న బొగ్గు విలువ రూ.10వేల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. సెక్యూరిటీ జమేదార్ యాట ఓదెలు, సిబ్బంది ఉన్నారు.

సింగరేణి వార్తలు

ఘనంగా సింగరేణి పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎడ్యుకేషనల్ సెక్రటరీ శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాల 48వ వార్షిక వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జి.శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ డీవైజీఎం పర్సనల్ ఆర్జీ–2 ఏరియా అనిల్‌కుమార్‌తో కలిసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మిక, ఉద్యోగుల పిల్లలకు తక్కువ ఫీజుతో ఎంతో అనుభవం కలిగిన నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కార్పొరేట్ విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, పాఠశాల హెచ్‌ఎం సందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడీకే–11వ గని సూపర్‌వైజర్‌పై చర్య తీసుకోవాలి



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గనిలో షార్ట్ ఫైరర్‌గా పనిచేస్తున్న అజయ్‌కుమార్‌పై భౌతిక దాడికి దిగిన సూపర్‌వైజర్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని ఆఫీస్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గనిలో దాడి గురించి వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, సింగరేణి ఎంప్లాయీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పులి మోహన్, యాట ఓదెలు, గంగారపు లింగమూర్తి, ఆరెపల్లి రాంచందర్, దామెర ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: సంక్షేమ బోర్డు పథకాలను ప్రభుత్వమే నేరుగా భవన నిర్మాణరంగ కార్మికులకు అందించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీనగర్‌కాలనీలోని సహాయక కార్మికశాఖ అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం వారు నిరసన తెలిపారు. రెక్కల కష్టం నమ్ముకుని జీవిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు కష్టానికి తగిన ప్రతిఫలం లభించడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, అశోక్, ఎల్లయ్య, రాజేశం, దుర్గయ్య, మల్లేశం, రవికుమార్, కొమురయ్య, రాజనర్సు, రాజయ్య, రాజమౌళి, భూషణం, సాంబయ్య, సదయ్య పాల్గొన్నారు.



జూలపల్లి: వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు



ఓదెల: నృత్యం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

జూలపల్లి: మండలంలోని తేలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీందర్ మాట్లాడుతూ పరీక్షల్లో 10 జీపీఏ సాధించి ఉన్నత లక్ష్యం సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, రజిత, గోపాల్, రాజశేఖర్, సతీశ్, వ్యాసకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

ఓదెల మోడల్ స్కూల్‌లో..

ఓదెల: ఓదెల మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పెంచిన వేతనం చెల్లించండి

మంథని: మున్సిపల్ కార్మికులకు పెరిగిన వేతనం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. 9నెలలైనా పెంచిన వేతనం అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు రావాల్సిన వస్తువులు సైతం అందించడం లేదన్నారు. ఎస్ఎంఆర్ కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకోవాలని కోరారు.

రమణయ్యకు శ్రీపాదరావు స్మారక అవార్డు



అవార్డు అందుకుంటున్న రమణయ్య

గోదావరిఖనిటౌన్: గోదావరి కళా సంఘాల అధ్యక్షులు, సింగరేణి కోల్ ఇండియా కళాకారుడు కనకం రమణయ్యకు శ్రీపాదరావు స్మారక అవార్డు ప్రదానం చేశారు. మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతి సందర్భంగా కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్ జిల్లా రంగినేని భవన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో అవార్డుతో సన్మానించారు. ఈ అవార్డును కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండ్ర కృపాదానం చేతుల మీదుగా అందుకున్నారు.